సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

బుధవారం । 28 । జూన్ । 2023



జీవ సాంకేతిక పరిజ్ఞానంతో..

కాకతీయ యూనివర్సిటీలో మూడు రోజుల అంతర్జాతీయ సదస్సు మంగళవారం ప్రారంభమైంది. పలువురు విదేశీ సైంటిస్టులు హాజరయ్యారు.

- 8లో



త్వరలో 'కిటెక్స్' ప్రారంభం

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో నిర్మించిన కిటెక్స్ కంపెనీని రెండు నెలల్లో సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని మంత్రి కేటీఆర్ ట్వీట్ చేశారు.

- 8లో

గరిష్ఠం/కనిష్ఠం

33.0° /25.0°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం చల్లగా ఉంటుంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ డీఎం

హన్మకొండ : ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు స్వీకరించేందుకు బుధవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్‌రావు తెలిపారు. ప్రయాణికులు 9959226047 నంబర్‌కు కాల్ చేసి సలహాలు, సూచనలు, సమస్యలు తెలియజేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

నేడు పెన్షనర్ల ధర్నా



హన్మకొండ : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఉదయం 11 గంటలకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయనున్నట్లు తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ తూపురాణి సీతారం తెలిపారు. హనుమకొండలోని అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 జూలై 1 నుంచి నుంచి నూతన పీఆర్‌సీ అమలు చేయాల్సి ఉన్నా ఇంత వరకు పేరివిజన్ కమిషన్ వేయలేదని, బకాయి ఉన్న రెండు డీఏలను ప్రకటించలేదన్నారు. పెన్షనర్స్ జేఏసీ నాయకులు పెండ్యాల బ్రహ్మయ్య, నారాయణగిరి వీరన్న, సీహెచ్. సత్యనారాయణ, బేతి శంకర్‌లింగం, ఎంఏ రహీం, జిల్లా ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు.

ఏఆర్‌సీఐతో నిట్ వరంగల్ ఎంఓయూ



కాజీపేట అర్బన్ : ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ రీసెర్చ్ సెంటర్ ఫర్ పౌడర్ మెటలర్జీ అండ్ న్యూమెటీరియల్స్ హైదరాబాద్‌తో నిట్ వరంగల్ మంగళవారం ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్‌లోని ఏఆర్‌సీఐ కార్యాలయంలో ఏఆర్‌సీఐ డైరెక్టర్ డాక్టర్ టాటా నంగరావు, నిట్ వరంగల్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. కార్యక్రమంలో నిట్ ప్రొఫెసర్ సోమశేఖర్, నిట్ రామకృష్ణ, విజయ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదోన్నతి మైలురాయి



వరంగల్ క్రైం : ప్రభుత్వ ఉద్యోగులకు పదోన్నతితోపాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇన్‌స్పెక్టర్లుగా పనిచేస్తూ ఇటీవల ఏసీపీలుగా పదోన్నతి పొందిన జనార్దన్‌రెడ్డి, రమేష్‌కుమార్, విజయ్‌కుమార్, సతీష్‌బాబు మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్‌ను మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అధికారులను అభినందనలు తెలిపి పలు సూచనలు చేశారు. పదోన్నతి అనేది ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జీవితంలో ఒక మైలురాయివంటిదన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట : హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిలోని మైనార్టీ గురుకులాల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ ఔట్ సోర్సింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా జిల్లాల మైనార్టీ సంక్షేమాధికారులు మేన శ్రీను, కె.విక్రమ్‌కుమార్ మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. వరంగల్ జిల్లా పరిధిలోని నర్సంపేట (బాలికలు-1) గురుకులంలో జూనియర్ లెక్చరర్ (బాటనీ)-1, టీజీటీ ఫిజికల్ సైన్స్-1, వరంగల్ (బాలికలు-1) గురుకులంలో జూనియర్ లెక్చరర్ (బాటనీ)-1 (మహిళా అభ్యర్థులు మాత్రమే) ఖాళీగా ఉన్నాయి.అభ్యర్థులు జూలై 5వ తేదీలోగా సర్క్యూట్ గెస్ట్ హౌస్ రోడ్డులోని జిల్లా మైనార్టీ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 93988 60995 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ (బాలుర) గురుకులంలో డాటా ఎంట్రీ ఆపరేటర్ (జనరల్ అభ్యర్థులు)-1, హనుమకొండ (బాలికల) గురుకులంలో సెక్యూరిటీ గార్డు (పురుషులు)-1, హౌస్ కీపింగ్-1 (స్త్రీలు మా త్రమే), పరకాల బాలుర-1 గురుకులంలో ప్లంబర్ కమ్ ఎలక్ట్రీషియన్ (పురుషులు)-1 ఖాళీగా ఉన్నాయి. దరఖాస్తులను 30లోగా సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్‌లోని మైనార్టీ సంక్షేమాధికారి కార్యాలయంలో సమర్పించాలని, వివరాలకు 80749 94073 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

స్వీపింగ్.. యంత్రాలు!

రోడ్లు ఊడ్చే యంత్రాలు ఉన్నా లేనట్లే

- ప్రధాన రహదారుల్లో తప్పని స్వీపర్ల సేవలు
- రూ.కోట్లు వెచ్చించినా నెరవేరని లక్ష్యం.. బల్దియాకు భారం



స్వీపింగ్ యంత్రాలు

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర పాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో రాత్రి, ఉదయం వేళల్లో ప్రధాన రహదారులపై వాహనాలు అతివేగంగా వెళ్తాయి. రోడ్లు శుభ్రం చేసే పారిశుద్ధ్య కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఉండేందుకు బల్దియా స్వీపింగ్ యంత్రాలు కొనుగోలు చేసింది. వాటి వల్ల ఏమైనా ప్రయోజనం ఉందా అంటే శూన్యమనే చెప్పాలి. లక్షల రూపాయలు థర్డ్‌పార్టీకి చెల్లిస్తున్న బల్దియా.. మళ్లీ కార్మికులతో క్షేత్రస్థాయిలో అవే స్వీపింగ్ పనులు చేయిస్తుండడం గమనార్హం. బల్దియాలో ప్రజాధనం దుర్వినియోగమవుతుందనడానికి ఇదో ఉదాహరణ. సొంత ప్రయోజనాల కోసం సంస్థ నిధులను పెద్ద మొత్తంలో దుర్వినియోగం చేస్తున్నారన్న అపవాదును మూటగట్టుకుంటున్నారు. ప్రజారోగ్య విభాగంలో రూ.కోట్లు పోసి వాహనాలు కొనుగోలు చేసి, వాటి మెయింటెనెన్స్, ఆపరేషన్ పేరిట నిధులు గుమ్మరిస్తున్నారే తప్ప ఆశించిన లక్ష్యాలు నెరవేరడం లేదు.

యంత్ర 'భూతాలు'

రాత్రి, ఉదయం వేళల్లో పారిశుద్ధ్య పనుల కోసం గ్రేటర్ హైదరాబాద్ తర్వాత గ్రేటర్ వరంగల్‌కు ఎక్కువ వాహనాలున్నాయి పాతవి 232 ఉండగా, కొత్తవి 278 వరకు ఉన్నాయి. రెండేళ్ల కిందట పట్టణ ప్రగతి నిధులతో రూ.42.30 కోట్లు వెచ్చించి వాహనాలను కొనుగోలు చేసింది. అందులో భాగంగా ప్రధాన రహదారుల స్వీపింగ్ కోసం 6 పెద్దవి, 4 చిన్న యంత్రాలను కొన్నారు. పెద్ద మిషన్ (6.5 క్యూబిక్ మీటర్ల హూపర్) సామర్థ్యం గలవి (టక్ మౌంటెడ్ మిషన్లు), చిన్నవి (ఒక క్యూబిక్ మీటరు హూపర్) సామర్థ్యం కలవి ఉన్నాయి. మనుషులతో పనిలేకుండా రోడ్లను ఊడ్చడంతోపాటు చెత్తను వాహనంలోని డబ్బాలోకి లాక్కోవడం వీటి ప్రత్యేకత. ఒక్కో మిషన్‌తో కనీసం 10 కిలోమీటర్ల చొప్పున ఊడ్చినా దాదాపు 80 శాతం ప్రధాన రహదారులు శుభ్రమవుతాయి.

నిర్వహణ, ఆపరేషన్.. థర్డ్ పార్టీకి అప్పగింత

ఈ స్వీపింగ్ యంత్రాల నిర్వహణ, ఆపరేషన్‌ను బల్దియా.. థర్డ్ పార్టీకి కట్టబెట్టింది. డ్రైవర్లు, డీజిల్, పరికరాలు, ఇతర ఖర్చు మొత్తం థర్డ్ పార్టీ భరించాల్సి ఉంటుంది. పెద్ద స్వీపింగ్ యంత్రం కిలోమీటరు ఊడ్చినందుకు గంటకు రూ.1,606, చిన్న యంత్రానికి గంటకు రూ. 806 చెల్లిస్తోంది. సొమ్ము గంటల లెక్కన ఆ సంస్థకు చెల్లిస్తోంది. ఇలా పెద్ద స్వీపింగ్ యంత్రం 17,500 గంటలు, చిన్న వాహనం 11,680 గంటలు ఆపరేషన్ కింద అప్పగించారు. కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి హనుమకొండ మీదుగా వరంగల్ రైల్వే స్టేషన్ వరకు, కరీంనగర్ రోడ్డులో రాత్రివేళలో పెద్ద వాహనాలు శుభ్రం చేస్తుంటాయి. ఇక చిన్న వాహనాలు నగరంలోని హంటర్ రోడ్డు, ఖమ్మం రోడ్డు, పోచమ్మమైదాన్, జేపీఎన్, ఆర్ఎన్‌టీ రోడ్లను స్వీపింగ్ చేస్తుంటాయి. కోట్ల రూపాయలతో కొనుగోలు చేసిన ఈ వాహనాల వల్ల పెద్ద లాభం కనిపించడం లేదని ప్రజారోగ్యం అధికారులు, సిబ్బంది పేర్కొంటున్నారు.

స్వీపర్లకేది ఊరట!

గతంలో ప్రధాన రహదారుల్లో సుమారు 120 మంది కార్మికులు రోడ్లను శుభ్రం చేసేవారు. యంత్రాలు రోడ్లకు ఇరువైపులా శుభ్రంగా చేయగా, మళ్లీ కార్మికులు ఫుట్‌పాత్‌లు, డివైడర్లలో స్వీపింగ్ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన యంత్రాలతో ఏమైనా మెయిన్ రోడ్లను శుభ్రం చేసే కార్మికుల సంఖ్య తగ్గిందా? అంటే అదీ లేదు. స్వీపింగ్ యంత్రాలు కొనుగోలు కంటే ముందు ఉన్న కార్మికులు ఇప్పుడు కూడా క్షేత్రస్థాయిలో అవే పనులు చేస్తున్నారు. మరి ఈ యంత్రాల వల్ల కలిగే ప్రయోజనం ఏమిటో బల్దియా ఇంజనీర్లు, ప్రజారోగ్యం అధికారులే సమాధానం చెప్పాలనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. కానీ సదరు సంస్థకు మాత్రం డబ్బులు చెల్లింపు ప్రక్రియ నిరాటంకంగా కొనసాగుతోంది. ఇలా.. రెండేళ్ల కాలంలో నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగమవుతున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఈ వాహనాల పేరిట సాగుతున్న దోపిడీలో ఉన్నతస్థాయి అధికారుల నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వరకు వాటాలు ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై కమిషనర్ దృష్టిపెట్టాలని నగరవాసులు కోరుతున్నారు.





ఆహార.. జపం..

ఇటీవల కురిసిన వర్షానికి.. హనుమకొండ మండలంలోని రెడ్డిపురం కుంటలోకి వరద వచ్చి చేరింది. దీంతో ఆహారం కోసం కొంగలు, బుడిబుంగలు చెరువులోకి పెద్ద ఎత్తున వచ్చి చేరాయి. చెరువు మధ్యలో ఉన్న రెండు చెట్లలో ఒకదానిపై కొంగలు, మరో చెట్టుపై బుడిబుంగలు(జలిమలు).. ఇలా జపం చేస్తూ ఆహార వేటలో బిజీబిజీగా కనిపించాయి.

- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, వరంగల్

మీ వాహనాలను ఇలాగే ఉంచుతారా?

మరమ్మతుల్లో జాప్యం తగదు

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా
- బాలసముద్రంలో వెహికిల్ షెడ్డు తనిఖీ



వెహికిల్ షెడ్డును తనిఖీ చేసి డ్రైవర్లతో మాట్లాడుతున్న కమిషనర్ షేక్‌రిజ్వాన్‌బాషా

వరంగల్ అర్బన్ : మరమ్మతులు లేక పదుల సంఖ్యలో వాహనాలు మూలకు చేరాయి. మీ వాహనాలను ఇలానే పక్కన పెడతారా? పద్ధతి మార్చుకోండి అంటూ గ్రేటర్ వరంగల్ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా నిర్వాహకులకు క్లాస్ తీసుకున్నారు. హనుమకొండ బాలసముద్రంలోని బల్దియా వెహికిల్ షెడ్డును మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పార్కింగ్ చేసిన వాహనాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరమ్మతుల కారణంగా పక్కన పెట్టారని డ్రైవర్లు సమాధానం ఇచ్చారు. దీంతో కమిషనర్ వెహికిల్ షెడ్డు ఏఈ, సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వాహనాలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టిపోయే ప్రమాదం ఉందని, నిర్లక్ష్యం వీడాలని హెచ్చరించారు. మరమ్మతులో జాప్యం వద్దని పేర్కొన్నారు. చెత్త సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిశీలించి స్వచ్ఛ ఆటో డ్రైవర్ కమ్ ఓనర్లతో మాట్లాడారు.

మార్టిగేజ్ బిల్డింగ్‌ల పరిశీలన

హనుమకొండ నయీంనగర్ షాపింగ్ మాల్, హంటర్ రోడ్డు మార్టిగేజ్ రిలీజ్ భవనాలను పరిశీలించారు. మాల్‌లో, నూతన భవన నిర్మాణ దరఖాస్తుల మ్యాపులను తనిఖీ చేసి, కొలతలు వేశారు. పోచమ్మకుంట, సీఎస్ఆర్ గార్డెన్ ప్రాంతంలో నిర్మించిన అపార్ట్‌మెంట్ కొలతలు వేసి కమిషనర్ పరిశీలించారు.

ముంపు ప్రాంతాల సందర్శన

వరంగల్‌లోని ఆటోనగర్, తుమ్మలకుంట, చిన్నవడ్డేపల్లి చెరువు, గణేష్‌నగర్, సాయినగర్, బాలాజీ జంక్షన్ తదితర ముంపు ప్రాంతాలను కమిషనర్ సందర్శించారు. ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పెద్ద మోరీల్లో ఆయిల్ బాల్స్ వేయించాలని బయాలజిస్ట్‌ను ఆదేశించారు. కార్పొరేటర్ సురేష్ జోషి పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఎస్ఈ కృష్ణారావు, సిటీ ప్లానర్ వెంకన్న, ఎంహెచ్ఓ జ్ఞానేశ్వర్, బయాలజిస్టు మాధవరెడ్డి, ఈఈ శ్రీనివాస్, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, డీఈ సారంగం, శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్య, ఏఈలు సౌజన్య, కార్తీక్ రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల మాటలు నమ్మొద్దు

డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



కార్యకర్తలతో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా/కాజీపేట అర్బన్ : బీఆర్ఎస్ నాయకుల మాయమాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. హనుమకొండ పద్మాక్షికాలనీలోని స్వామి వివేకానంద స్కూల్, న్యూశాయంపేటలో మంగళవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. ప్రజలను దోచుకోవడం, భూకబ్జాలు చేయడంతోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు సరిపోయిందని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ శ్రేణులు శ్రమించాలని అన్నారు. అందుకోసం డివిజన్‌లోని ప్రతి బూత్‌లో యాక్షన్ ప్లాన్ అమలు చేసి ఎన్నికలకు సిద్ధం కావాలని, రానున్న 5 నెలలు అత్యంత కీలకమని దిశానిర్దేశం చేశారు. ప్రతీ బూత్‌లో ముగ్గురు లేదా నలుగురిని సోషల్ మీడియా కోసం నియమించాలని సూచించారు. 9 సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేపట్టలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ విజయంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమావేశాల్లో కార్పొరేటర్లు తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమన్నారాయణ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాసరావు, అనిల్, డాక్టర్ రామకృష్ణ, బొమ్మతి విక్రమ్, మంద రాకేష్, కనకరాములు, ఎల్లయ్య, మహేందర్, ప్రకాష్, మొయిన్‌ఖాన్, ఇబ్రహీం, అశ్విన్, స్రవంతి, పూర్ణ, మనోహర్, నాగరాజు, కుమారస్వామి, కృష్ణ, మురళి, రమేష్, యాదగిరి, తిరుపతి పాల్గొన్నారు.

దీప్తా, కులసుందరి క్రమాల్లో అమ్మవారికి పూజలు



హన్మకొండ కల్చరల్ : భద్రకాళి దేవాలయంలో జరుగుతున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు మంగళవారం ఉదయం అమ్మవారికి దీప్తా, కులసుందరి క్రమాల్లో పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఉదయం నుంచి సుప్రభాతసేవ, నిత్యాహ్నికం చేశారు. అనంతరం స్వపనమూర్తిని కాళీ క్రమంలో నవమి తిథికి ఆదిదేవత అయిన దీప్తా అమ్మవారిగా, షోడశీ క్రమంలో కులసుందరిగా అలంకరించి చతుఃస్థానార్చన పూజలు నిర్వహించారు.

నాలాలు, డ్రెయినేజీల్లో పూడికతీయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో పురపాలక శాఖ డైరెక్టర్ సత్యనారాయణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వింగ్ అధికారులు

వరంగల్ అర్బన్ : వరదలను ఎదుర్కోవడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని రాష్ట్ర పురపాలక శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో నాలాలు, డ్రెయినేజీల్లో పూడికతీత పనులు పూర్తి చేయాలన్నారు. కల్వర్టులు, ఓపెన్ నాలాలకు రక్షణగా బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు రేడియం రిబ్బన్లు అతికించాలన్నారు. సమావేశంలో ఎస్ఈలు ప్రవీణ్ చంద్ర, కృష్ణారావు, సీహెచ్ఓ శ్రీనివాసరావు, బయాలజిస్ట్ మాధవరెడ్డి, డిప్యూటీ కమిషనర్లు శ్రీనివాసరెడ్డి, జోనా పాల్గొన్నారు.

కాంగ్రెస్ సిటీ మహిళా అధ్యక్షురాలు ఎవరు?

- శ్రీలతను నియమిస్తూ జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆదేశాలు
- స్వప్నను నియమించిన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు
- వర్గ పోరుతో అయోమయంలో పార్టీ శ్రేణులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ సిటీ మహిళా అధ్యక్షురాలు స్వప్న, నల్గొండ రమేష్

వరంగల్: కాంగ్రెస్ వరంగల్ సిటీ మహిళా అధ్యక్షురాలిగా రెండు రోజుల్లో ఇద్దరు నియామకం కావడం.. ఇందులో ఎవరు అసలు అధ్యక్షురాలు అన్న సంశయంలో వరంగల్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో నెలకొంది. వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఆదేశాలతో కరీమాబాద్‌కు చెందిన బొౌరిశెట్టి శ్రీలతను సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా నియమిస్తూ జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం కొండా దంపతుల ఆశీస్సులతో రంగశాయిపేటకు చెందిన నారగోని స్వప్నగౌడ్‌ను నియమిస్తూ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇరువురు తమను నియమించినట్లు ప్రకటించుకోవడంతో ఎవరు సిటీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అన్న విషయంపై సందిగ్ధత ఏర్పడింది. ఈ నియామకంతో వరంగల్ తూర్పులో ఎర్రబెల్లి స్వర్ణ, కొండా దంపతుల వర్గపోరు బయటపడిందని పార్టీలో చర్చించుకుంటున్నారు. ఈమేరకు మంగళవారం వరంగల్ ఎల్‌బీనగర్‌లో నారగోని స్వప్న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాయకుడు నల్గొండ రమేష్ మాట్లాడుతూ వరంగల్ తూర్పు కాంగ్రెస్‌లో కొంతమంది కోవర్టులు కావాలని గ్రూపు రాజకీయాలు చేస్తున్నారని అన్నారు. వీరిపై టీపీసీసీలో ఫిర్యాదు చేస్తామన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు సునీతారావు నియమించినందున సిటీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలిగా తాను కొనసాగుతానని స్వప్నగౌడ్ తెలిపారు. జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలిగా శ్రీలత కొనసాగుతున్నందున సిటీ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలి నియామకం రద్దు చేస్తున్నట్లు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ప్రకటించిన వాయిస్ రికార్డును మీడియాకు విడుదల చేశారు. అదే విధంగా రాష్ట్ర అధ్యక్షురాలి అనుమతి లేకుండా శ్రీలతను నియమించిన జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు సునీతారావు తెలిపారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు మీసాల ప్రకాశ్, భీమగాని సౌజన్య, బొట్ల సదానందం, దాసరి రాజేష్, అఫ్జల్, రేణుకుంట్ల శివ, సంపత్, సందీప్, కూచన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం..

ఏర్పాట్లలో అధికార యంత్రాంగం బిజీబిజీ

- ఈవీఎంల పరిశీలన.. గోదాముల తనిఖీలు
- ఎన్నికల సంఘం సమావేశానికి హాజరైన కలెక్టర్లు
- ఢిల్లీలో సమావేశాలకు వెళ్లిన అడిషనల్ కలెక్టర్లు..



ఏనుమాముల మార్కెట్ గోదాములో భద్రపరిచిన ఈవీఎం, వీవీ ప్యాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా ఓటర్లు	
పురుషులు	13,78,380
మహిళలు	13,97,121
ఇతరులు	343

జిల్లాల వారీగా పోలింగ్ కేంద్రాలు

జిల్లా	పోలింగ్‌కేంద్రం
హనుమకొండ	479
వరంగల్	766
జనగామ	857
జేఎస్ భూపాలపల్లి	317
మహబూబాబాద్	531
ములుగు	302

సాక్షిప్రతినిధి, వరంగల్: శాసనసభ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు అధికార యత్రాంగం సర్వసన్నద్ధమవుతోంది. ఓటర్ల ముసాయిదా, సవరణ, నమోదు మొదలు.. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)లను సిద్ధం చేస్తున్నారు. అసెంబ్లీ సార్వత్రిక ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా పనుల్లో అధికారులు బిజీబిజీగా కనిపిస్తున్నారు. పది రోజుల క్రితం ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు కలెక్టర్లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఎన్నికల నిర్వహణ శిక్షణకు జిల్లా అదనపు కలెక్టర్లు హాజరయ్యారు. 23, 24 తేదీల్లో సైతం హైదరాబాద్‌లో సమావేశాలు జరగగా.. కలెక్టర్లు, జిల్లా ఉన్నతాధికారులను అప్రమత్తం చేశారు. పోలింగ్ బూత్ స్థాయి అధికారుల (పీబీఎల్‌ఓ)తో కలిసి ఓటర్ల జాబితాపై ప్రత్యేక సర్వే నిర్వహించారు. స్థానికంగా లేని ఓట్ల ఏరివేతను చేపట్టడంతోపాటు ఒకే ఇంటి నంబర్‌పై 10 నుంచి 110 వరకు ఓట్లు నమోదు కావడంపైనా ఆరా తీస్తున్నారు.

ఉమ్మడి వరంగల్‌లో 27,75,844 మంది ఓటర్లు

ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా మొత్తం 27,75,844 మంది ఓటర్లు ఉన్నారు. జనవరి 5న వెల్లడించిన తుది జాబితాలో తప్పులు కుప్పలు తెప్పలుగా జరిగినట్లు గుర్తించిన అధికారులు.. వాటిని సవరించేందుకు చేపట్టిన వడబోత ముగింపునకు చేరింది. భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల సరిహద్దున మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలు ఉండడంతో ఏటా పనుల నిమిత్తం వస్తున్న కూలీలు, బంధువులను ఓటరు జాబితాలో చేర్పించినట్లుగా గుర్తించి తొలగించారు. భూపాలపల్లిలో రెండు ఇంటి నంబర్లపై 255, వరంగల్‌లో రెండింటిపై 212, హనుమకొండలో రెండింటిపై 274, ములుగులో ఒకే ఇంటిపై 110 ఓట్లుండడంపై వడబోసి సరి చేశారు. కాగా ఉమ్మడి వరంగల్‌లో మొత్తం 3,252 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వాటిని పీబీఎల్‌ఓలు తనిఖీలు చేస్తున్నారు. ఈ మేరకు ఈవీఎంలను కూడా పరిశీలించిన కలెక్టర్లు, వాటిని నిల్వచేసిన గోదాములను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీలు చేశారు.

మాక్‌పోలింగ్‌కు ఏర్పాట్లు..

రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకప్ (ఎఫ్ఎల్‌సీ)లను నిర్వహిస్తున్నారు. కలెక్టర్ల పర్యవేక్షణలో ఉమ్మడి వరంగల్‌లో శనివారం నుంచి సోమవారం వరకు ఈ ఎఫ్ఎల్‌సీ కార్యక్రమాలు నిర్వహించారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్.. ఏనుమాముల మార్కెట్ ఈవీఎం గోడౌన్‌లో ఫస్ట్ లెవల్ చెకప్ నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల నాయకుల సమక్షంలో గోడౌన్ తెరిచి, ఫస్ట్ లెవెల్ చెక్ నిర్వహించారు. ఈవీఎంల తనిఖీల సందర్భంగా వాటిని పరిశీలించేందుకు ఇంజనీర్ల బృందాలు కూడా ఉమ్మడి జిల్లాలో తిరుగుతున్నాయి. ఈవీఎంల పరిశీలన, తనిఖీల తర్వాత ప్రతి ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ ద్వారా మాక్ పోలింగ్ నిర్వహించేందుకు బృందాలు ఏర్పాట్లు చేశాయి. ఇదిలా ఉండగా త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారని అధికారులు ప్రకటించారు. ఈ మేరకు అన్ని జిల్లాల్లో అధికారులు అప్రమత్తం అయ్యారు. ముందస్తుగా ఈవీఎంల పరిశీలన, గోదాముల తనిఖీలు, మాక్‌పోలింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

భూసేకరణ త్వరగా పూర్తిచేయాలి

వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య



భూసేకరణ ప్రక్రియపై ఆర్డీఓలతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

కరీమాబాద్: వరంగల్ జిల్లా పరిధిలో నిర్మించనున్న రైల్వే మూడో లైన్, నేషనల్ హైవే కోసం భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మంగళవారం సంబంధిత ఆర్డీఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గీసుకొండ, సంగెం, ఖిలా వరంగల్, నెక్కొండ మీదుగా రైల్వే మూడో లైన్ ఏర్పాటు, గీసుకొండ, సంగెం, పర్వతగిరి, నెక్కొండ మండలాల మీదుగా నేషనల్ హైవే(163) నిర్మాణం జరగనుందని తెలిపారు. భూ సేకరణ ప్రక్రియ వీలైనంత తొందరగా పూర్తి చేయాలని ఆర్డీఓలకు సూచించారు. నర్సంపేట, వరంగల్ ఆర్డీఓలు శ్రీనివాసులు, మహేందర్‌జీ, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన కల్పించాలి

హన్మకొండ: విద్యుత్ ప్రమాదాలపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఎన్పీడీసీఎల్ పరిధిలోని జిల్లాల ఎస్ఈలు, డీఈలు, ఎస్ఏఓలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా చూడాలని సూచించారు. బ్రేక్ డౌన్స్, ట్రిప్పింగ్స్ లేకుండా చూడాలని ఆదేశించారు. గిరి వికాసంలో దరఖాస్తు చేసుకున్న సర్వీస్‌లను వెంటనే మంజూరు చేయాలన్నారు. డైరెక్టర్ బి.వెంకటేశ్వర రావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు అశోక్ కుమార్, సదర్ లాల్, కిషన్, బీకంసింగ్, రాజ్ చౌహన్, డీఈ(ఐటీ) అనిల్ కుమార్ పాల్గొన్నారు.

రైలులో మరిచిపోయిన బ్యాగు అప్పగింత

కాజీపేట రూరల్ : రైలులో ప్రయాణికురాలు మరిచిపోయిన బ్యాగును ఆర్పీఎఫ్ పోలీసులు మంగళవారం అప్పగించారు. కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ సంజీవరావు కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన ప్రియాంక ఆంధ్రప్రదేశ్‌లోని యలమంచలి నుంచి విశాఖపట్టణం–హైదరాబాద్ వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలులో వరంగల్‌కు చేరుకుంది. ఆమె రైలు దిగుతూ బ్యాగును మరిచిపోయింది. అప్పటికే రైలు కదిలి కాజీపేట వైపు వెళ్లింది. ఆ బ్యాగులో రూ.65,000 నగదు, 10 గ్రాముల బంగారు ఆభరణాలు ఉన్నాయి. వెంటనే ఆమె వరంగల్ ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ నర్మదకు ఫిర్యాదు చేసింది. ఆమె కాజీపేట ఆర్పీఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేసింది. రైలు కాజీపేటకు చేరుకోగానే ఆర్పీఎఫ్ సిబ్బంది కోచ్‌లోకి వెళ్లి వెతికి బ్యాగును గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ప్రియాంక కుటుంబ సభ్యులను పిలిపించి నగదు, బంగారంతో బ్యాగును ఆర్పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు సీఐ తెలిపారు.

జీవ సాంకేతిక పరిజ్ఞానంతో నూతన వంగడాలు



వీసీ తాటికొండ రమేశ్

- కేయూలో ప్రారంభమైన అంతర్జాతీయ కాన్ఫరెన్స్



మాట్లాడుతున్న వీసీ తాటికొండ రమేశ్, ప్రొఫెసర్ శ్రీనివాసన్ చంద్రసేగరాన్

కేయూ క్యాంపస్: జీవ సాంకేతిక పరిజ్ఞానంతో నూతన వంగడాలను అభివృద్ధి చేసుకోవచ్చని, హరిత విప్లవానికి కూడా ప్లాంట్ జీనోమ్ ఎడిటింగ్ దోహదం చేస్తుందని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. కేయూలో బయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో యూకేలోని అబెర్విస్త్ యూనివర్సిటీ వెల్స్, యూకే కొలబరేషన్‌తో 'ప్లాంట్ బయోటెక్నాలజీ అండ్ జెనోమ్ ఎడిటింగ్' అనే అంశంపై మూడురోజులు నిర్వహించనున్న అంతర్జాతీయ కాన్ఫరెన్స్ మంగళవారం క్యాంపస్‌లోని సెనేట్‌హాల్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ఉత్పత్తులు కూడా అవసరమేనన్నారు. భారతదేశంలో హరితవిప్లవం ద్వారా ఆహార కొరత తీరిందన్నారు. జన్యుసవరణతో నూతనవంగడాల ఉత్పత్తి పెరుగుదల సాధ్యమన్నారు. కేయూ బయోటెక్నాలజీ విభాగం పరిశోధనల పరంగా ముందుకు సాగుతోందన్నారు. హైదరాబాద్ ఐసీఏఆర్ ఐఐఆర్ఆర్ డైరెక్టర్ ఆర్ఎం సుందరం మాట్లాడుతూ హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీలో ఆధునిక సాంకేతిక పరిశోధనల ద్వారా జీనోమ్ ఎడిటింగ్ పద్ధతుల్లో నూతన వరి వంగడాలను కూడా సృష్టించారని, అవి త్వరలోనే మార్కెట్‌లోకి రాబోతున్నాయన్నారు. ఈసదస్సుకు బయోటెక్నాలజీ విభాగం అడ్జెంట్ ఆచార్యుడు రామస్వామి అధ్యక్షత వహించారు.

జన్యువుల సవరణతో విప్లవాత్మక మార్పులు

మొక్కలలో జన్యుల సవరణ(జీనోమ్ఎడిటింగ్) ద్వారా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయని యూఎస్ఏలో జాన్‌హప్ కిన్స్ వర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాసస్ చంద్రసేగరాన్ అన్నారు.ఈ సదస్సులో ఆయన 'జీనోమ్ఎడిటింగ్ రెవల్యూషన్స్ ఇన్‌లైఫ్ సైన్స్' అనే అంశంపై కీలక ఉపన్యాసం చేశారు. అనంతరం ఈ సదస్సు చైర్మన్, కేయూ బయోటెక్నాలజీ అడ్జెంట్ ప్రొఫెసర్ సదానందం, విదేశీ సైంటిస్టులు ఆస్ట్రేలియా ముర్డోక్ యూనివర్సిటీ ఎస్ఏబీసీ ప్రొఫెసర్ ఎంజీకె జోన్స్, యూకేలోని అబెర్విసిత్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లూయిస్‌మూర్, అదే యూనివర్సిటీ ప్రొఫెసర్ డైలన్‌ఫిలిప్స్, అదే యూనివర్సిటీ ప్రొఫెసర్ హ్యాజోన్స్, కేయూ రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు, మలేషియా మలియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జెన్నిఫర్‌అనహారికృష్ణ, సింగపూర్ నేషనల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రకాశ్ పి కుమార్, కేయూ బయోటెక్నాలజీ విభాగం అడ్జెంట్ ప్రొఫెసర్ ఎస్ రామస్వామి మాట్లాడారు. కేయూ బయోటెక్నాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఏవి రావు , పి శ్రీనివాస్, శాస్త్రి ,అడ్జెంట్ ప్రొఫెసర్ క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అతిథులు.. ప్లాంట్ బయోటెక్నాలజీ జీనోమ్ ఎడిటింగ్ సావనీర్‌ను ఆవిష్కరించారు.

ప్లీనరీ లెక్చర్స్..

అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో ప్లీనర్ లెక్చర్స్ జరుగుతున్నాయి. ఒక్కొక్క ప్లీనరీలో ముగ్గురు ఉపన్యాసం ఇస్తారు. ఇందులో భాగంగా మొదటి రోజు 40 మంది వివిధ అంశాలపై పోస్టర్లను సమర్పించారు. ప్రొఫెసర్లు త్యాగి, డేనియల్ ఫిలిఫ్స్, ఈవి సిరెఖినా, హెటెంద్రకుమార్‌పటేల్, సుందరం, డాక్టర్ రాహుల్‌కుమార్, వివిధ టెక్నికల్ సెషన్లలతో ప్రసంగించారు.

విదేశీ, స్వదేశీ యూనివర్సిటీల నుంచి రాక

మూడురోజులపాటు జరిగే అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లో 'ప్లాంట్స్ బయోటెక్నాలజీ జీనోమ్ ఎడిటింగ్'పై 120 పరిశోధన పత్రాలు సమర్పించబోతున్నారు. విదేశీయులతోపాటు దేశంలోని వివిధ యూనివర్సిటీలనుంచి పరిశోధకులు వచ్చారు. వీరు 28,29 తేదీల్లో కూడా పరిశోధన పత్రాలు సమర్పిస్తారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ రమేశ్, విదేశీ సైంటిస్టులు



హాజరైన ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు

తుల్జా భవానీమాత శక్తి పీఠాన్ని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు



తుల్జాపూర్ భవానీమాతను దర్శించుకున్న వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు

హన్మకొండ: ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు మహారాష్ట్రంలోని తుల్జాపూర్‌లో తుల్జా భవానీ మాత శక్తిపీఠాన్ని దర్శించుకున్నారు. మంగళవారం సీఎం కేసీఆర్‌తో పండరీపూర్ నుంచి తుల్జాపూర్ చేరుకొని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అరూరి రమేష్, పెద్ది సుదర్శన్ రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, నన్నపునేని నరేందర్, బీఆర్ఎస్ నాయకులు తుల్జా భవాని మాత శక్తి పీఠాన్ని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కాంట్రాక్ట్ లెక్చరర్ సస్పెన్షన్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జె.జేత్యను సస్పెండ్ చేస్తూ మంగళవారం కేయూ రిజిస్ట్రార్ పి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. ఓ కేసు విషయంలో జేత్యను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేసినట్లు కథనాలు ప్రచురితమైన నేపథ్యంలో జేత్య ను సస్పెండ్ చేసినట్లు రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు.

రేపు అర్చకులకు అవగాహన

హన్మకొండ కల్చరల్: వరంగల్ జిల్లా దేవాదాయధర్మాదాయ శాఖ, ధూపదీపనైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో వరంగల్‌జోన్‌లోని కరీంనగర్, ఖమ్మం , వరంగల్,ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల 6ఏ, 6బీ, 6సీ దేవాలయాల అర్చకులు, ధూపదీపనైవేద్య అర్చకులకు ఈ నెల 29న ఆత్మీయ సమ్మేళనం, అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4గంటల వరకు లష్కర్‌బజార్‌లోని టీటీడీ కల్యాణమండపంలో సదస్సు జరుగుతుందని, ప్రముఖ వేదపండితులు.. అర్చకులకు ఆగమాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అర్చకులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

- హనుమకొండ బస్టాండ్‌లో పట్టుకున్న కళాశాల సిబ్బంది

కాటారం: కాటారం మండలం దామెరకుంటలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల నుంచి ఇంటర్ విద్యార్థిని అదృశ్యమై హనుమకొండ బస్టాండ్‌లో కనిపించింది. మహబూబాబాద్‌కి చెందిన ఓ విద్యార్థిని స్థానిక కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్ పొందింది. ఈ నెల 19న కళాశాలకు వచ్చి జాయిన్ అయింది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం బహిర్భూమికని మరుగుదొడ్ల వద్దకు వెళ్లిన సదరు విద్యార్థిని.. ప్రహరీ దూకి బయటకు వెళ్లింది. ఈ విషయం ఆలస్యంగా గుర్తించి కళాశాల సిబ్బంది విద్యార్థిని గురించి ఆరా తీయగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం హనుమకొండ బస్టాండ్‌కు వెళ్లగా అక్కడ విద్యార్థిని కనిపించింది. దీంతో తల్లిదండ్రులకు సమాచారం అందించి విద్యార్థిని అప్పగించారు. కాగా, కళాశాల ప్రహరీ దూకి.. విద్యార్థిని బయటకు వెళ్లే వరకూ కళాశాల సిబ్బంది గమనించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయమై ప్రిన్సిపాల్ మైథిలిని వివరణ కోరగా విద్యార్థిని కళాశాల నుంచి బయటకు వెళ్లిన విషయం వాస్తవమే అన్నారు. సదరు విద్యార్థిని కళాశాలకు వచ్చినప్పటి నుంచి అనాసక్తితోనే ఉందని తెలిపారు.

చికిత్స పొందుతున్న రాజశ్రీ మృతి

- కారు, టిప్పర్ ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య



రాజశ్రీ(ఫైల్)

ఎంజీఎం: ఆత్మకూర్ మండలంలోని కటాక్షపూర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలపాలై చికిత్స పొందుతున్న అనుమాల రాజశ్రీ (50) మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య ఐదుకు చేరింది. గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వరంగల్ అబ్బనికుంటకు చెందిన వెల్దండి సాంబరాజు (40) అనుమాల నర్సింహాస్వామి(52), వెల్దండి ఆకాంక్ష (26) వెల్దండి లక్ష్మీప్రసన్న (9) అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రగాయాలపాలైన అనుమాల రాజశ్రీ, హర్షితను ఎంజీఎంకు తరలించారు. హర్షిత ఆరోగ్యం మెరుగుపడడంతో ఆమెను డిశ్చార్జ్ చేశారు. తలకు తీవ్రగాయాలై శ్వాస తీసుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న రాజశ్రీకి వెంటిలేటర్ ద్వారా మూడు రోజుల నుంచి చికిత్స అందిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఆమె ఆరోగ్య పరిస్థితి మరింత విషమంగా మారి మృతి చెందినట్లు ఎంజీఎం వైద్యులు పేర్కొన్నారు.

పుట్టిన రోజు ముందురోజే..

కాశిబుగ్గ: రాజశ్రీ 50వ పుట్టిన రోజు బుధవారం. ఒకరోజు ముందు మృతిచెందడంతో బంధువుల రోదనలు మిన్నంటాయి. గతంలో జరిగిన ప్రమాదంలో ప్రాణాపాయంనుంచి బయటపడిన రాజశ్రీ.. ఈసారి మాత్రం తప్పించుకోలేకపోయిందంటూ బోరున విలపించారు.

కొరిశ చెక్క రసం తాగి వృద్ధుడు..

కన్నాయిగూడెం : కొరిశ చెక్క రసం తాగిన ఓ వృద్ధుడు.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని బుట్టాయిగూడెంలో జరిగింది. ఎస్సై సురేశ్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన కుమ్మరి లస్మయ్య (70)ను భార్య సమ్మక్క పెన్షన్ డబ్బు ఇవ్వమని కోరింది. దీంతో నన్ను డబ్బులు అడుగుతావా అంటూ మనస్తాపానికి గురై ఈ నెల 24వ తేదీన అడవికి వెళ్లి కొరిశ చెక్క రసం తాగాడు. లస్మయ్య ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కొడుకులు.. అడవిలో వెతకగా కొరిశ చెక్క రసం తాగి కనిపించాడు. వెంటనే వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

భూ ఆక్రమణపై విచారణ వేగవంతం..



కబ్జాకు గురైన దారిని పరిశీలిస్తున్న ఏసీపీ కిషన్, సీఐ శ్రీనివాస్

సాక్షి స్పందన

ఖిలా వరంగల్: వరంగల్ దూపకుంట రోడ్డులో జరిగిన భూ ఆక్రమణపై పోలీసులు విచారణ వేగవంతం చేశారు. మంగళవారం 'సాక్షి'లో 'తిర కాసు ..' 'ఒకే స్థలం.. రెండు సార్లు రిజిస్ట్రేషన్' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి సీపీ రంగనాథ్ ఆదేశాలతో ఏసీపీ బోనాల కిషన్ మంగళవారం వెంటనే స్పందించారు. ఖిలా వరంగల్ శివారు దూపకుంట రోడ్డులోని సర్వే నంబర్ 1372 న్యూ (831)లో ఆక్రమణకు గురైన స్థలాన్ని సీఐ శ్రీనివాస్, ఎస్సై సాంబయ్య, సిబ్బందితో కలిసి సందర్శించారు.ఆక్రమణకు గురైన స్థలంతోపాటు ఇరువురి డాక్యుమెంట్‌ను ఏసీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. భూ ఆక్రమణదారులు దారికి అడ్డంగా తీసిన గొయ్యిని పరిశీలించారు. అనంతరం ఇరువురి నుంచి వివరాలు సేకరించారు. త్వరితగతిన విచారణ చేపట్టి సీపీకి నివేదిక అందజేస్తామన్నారు. సీపీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామని ఏసీపీ పేర్కొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు



హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలంకు టీఎస్ ఆర్టీసీ బస్సు నడుపుతున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత తెలిపారు. జూలై 3న గురు పౌర్ణమి సందర్భంగా భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సును నడుపనున్నట్లు ఆమె ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు జూలై 1న రాత్రి 10 గంటలకు హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకంలోని విఘ్నేశ్వరుడి దర్శనానంతరం జూలై 2వ తేదీన రాత్రి 10 గంటలకు అరుణాచలం చేరుకుంటుందన్నారు. అరుణాచలేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత జూలై 3 రాత్రి 8 గంటలకు అరుణాచలంలో బయలుదేరి వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్, శ్రీ మహాలక్ష్మి అమ్మవారి సన్నిధికి వెళ్తుందని, ఇక్కడ దర్శనానంతరం బయలుదేరి జూలై 4న హనుమకొండకు చేరుకుంటుందన్నారు. అరుణాచలం గిరి ప్రదక్షిణ టూర్ ప్యాకేజీ ఒక్కరికి టికెట్ ధర రూ.4 వేలు నిర్ణయించినట్లు తెలిపారు. గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తులు టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్, ఆర్టీసీ బుకింగ్ కౌంటర్‌లోనూ ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. ఈ టూర్ ప్యాకేజీకి సంబంధించి పూర్తి సమాచారం కోసం 9494107944, 9959226047, 9959226048 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, శ్రీధర్



బీజేపీని ఆదరించాలి

కరీమాబాద్ : బీజేపీని ప్రజలు ఆదరించాలని మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 43వ డివిజన్ రాంగోపాల్‌పూర్, నాయుడుపెట్రోల్ బంక్ ప్రాంతాల్లో మంగళవారం ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల నరేంద్ర మోదీ పాలనలో దేశంలో ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలుచేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలలో కూడా కేంద్రం వాటా ఉంటుందని ప్రజ లకు వివరించారు.రాష్ట్రంలో ఈసారి బీజేపీ ప్రభుత్వం రావాలని పేర్కొంటూ కరపత్రాలు, స్టిక్క ర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బన్న ప్రభాకర్, మాదిరెడ్డి దేవేందర్‌రెడ్డి, జలగం రంజిత్‌రావు, మైదం వీరస్వామి, తాళ్లపల్లి చంద్రశేఖర్, ఉసిల్ల దయాకర్, ఎర్ర రాములు, మన్నె సాంబయ్య, అనిల్, విష్ణు, తరుణ్, రంజిత్, నాగరాజు పాల్గొన్నారు.

మురుగు కాలువలో శిశువు మృతదేహం లభ్యం

- ముల్కనూర్‌లో ఘటన
- పోలీసుల విచారణ

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని మత్స్య సహకార సంఘం వెనుక గల కాలనీలోని మురుగు కాలువలో మంగళవారం ఓ పసికందు మృతదేహం లభ్యమైంది. విష యం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం గుర్తు తెలియని మహిళ ఐదు నెలల పసికందును మురుగు కాలువలో పడేసి వెళ్లింది. శిశువుకు పూర్తిస్థాయిలో శరీర భాగాలు సైతం ఏర్పడలేదు. నెలలు నిండకముందే డెలివరీ కావడంతో మృతి చెందిన శిశువును మురుగుకాల్వలో వేశారు. దీంతో శిశువు మృతదేహాన్ని బయటకు తీసి వరంగల్ ఎంజీఎంకు తరలించి కాలనీలో అనుమానితులను విచారిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైల్వే ట్రాక్‌పై మహిళ ఆత్మహత్య

కాజీపేట రూరల్ : మంచిర్యాల జిల్లా మందమర్రి రైల్వే ట్రాక్‌పై మంగళవారం ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. కాజీపేట జీఆర్పీ సీఐ రామ్మూర్తి కథనం ప్రకారం.. కాజీపేట వెంకటాద్రినగర్‌కు చెందిన స్వర్ణ సీమహానంద్.. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతదేహం వద్ద ఎన్నికల గుర్తింపు కార్డుతోపాటు తన చావుకు భర్త రాజ్‌మహానంద్ కారణం అని రాసిన ఓ సూసైడ్ నోట్ లభించింది. మృతురాలి వద్ద లభించిన చిరునామా ప్రకారం అక్కడికి పోలీసులను పంపించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ సీఐ తెలిపారు.

త్వరలో కిటెక్స్ కంపెనీ ప్రారంభం



సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా గీసుకొండ–సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ మరోసారి వార్తల్లో నిలిచింది. 1,350 ఎకరాల విస్తీర్ణంలోని ఈ మెగా పార్కులో నిర్మించిన కిటెక్స్ కంపెనీ కార్యాలయాలతో కూడిన ఫొటోలను రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కేటీఆర్ మంగళవారం ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. సీఎం కేసీఆర్ దీనిని రానున్న రెండు నెలల్లో ప్రారంభించనున్నారని పేర్కొన్నారు.

పోలీసుల కస్టడీకి ముగ్గురు..

- వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు తీర్పు
- నేడు, రేపు విచారణ



జనగామ: బచ్చన్నపేట మండలం పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీవో రామకృష్ణయ్య హత్య కేసులో ప్రధాన నిందితుడిగా, జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న గిరబోయిన అంజయ్యతో పాటు మరో ఇద్దరిని రెండు రోజులు పోలీసు కస్టడీకి అనుమతిస్తూ వరంగల్ ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి మనీషా మెహ్రా మంగళవారం తీర్పు వెలువరించారు. ఈ మేరకు వెస్ట్ జోన్ డీసీపీ సీతారాం వెల్లడించారు. కేసు విషయంలో మరిన్ని విషయాలు తెలుసుకునేందుకు అంజయ్య, మిగతా ఇద్దరిని కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. నాలుగు రోజుల వాదోపవాదాల అనంతరం, ఎస్సీ, ఎస్టీ కోర్టు.. నిందితులను రెండు రోజులు పోలీసు కస్టడీకి అప్పగిస్తూ తీర్పు వెలువరించింది. కోర్టు ఆదేశాలను అనుసరించి నేడు (బుధవారం) ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ నేతృత్వంలో అంజయ్య, మిగతా ఇద్దరు నిందితులను కస్టడీలోకి తీసుకోనున్నారు. రెండు రోజుల విచారణ అనంతరం ముగ్గురిని కోర్టులో అప్పగించాల్సి ఉంటుంది.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని..

- భర్త గొంతు నులిమి చంపిన భార్య అరెస్టు

వరంగల్: తన వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భర్తను గొంతునులిమి చంపిన భార్యను, ఆమెకు సహకరించిన ప్రియుడిని మంగళవారం అరెస్ట్ చేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి పరిధిలోని ఆర్ఎస్ఆర్‌నగర్‌కు చెందిన బట్టు వెంకన్నను తన భార్య స్వప్న.. ప్రియుడు ప్రశాంత్ సహకారంతో ఏప్రిల్ 21న చంపింది. తన అన్న వెంకన్న అనుమానాస్పదంగా మృతి చెందాడని తమ్ముడు లక్ష్మణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు.. పోస్టుమార్టం నివేదికలో వెంకన్న గొంతు నులమడంతో చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించడంతో కేసును హత్యగా నమోదు చేశారు. వెంకన్న భార్య బట్టు స్వప్న పరారీలో ఉండడంతో ప్రత్యేక టీమును ఏర్పాటు చేయడంతో అమెను, సహకరించిన ప్రశాంత్‌లను మంగళవారం ఏనుమాములో పట్టుకున్నారు. వారిని విచారించగా స్వప్నకు అదే కాలనీలో నివాసం ఉండే ఆటో డ్రైవర్ లావుడ్య ప్రశాంత్‌తో పరిచయం ఏర్పడి ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారితీసిందని వెల్లడైంది. ఈక్రమంలో స్వప్న ప్రశాంత్‌లు సన్నిహితంగా ఉండడం కాలనీవాసుల ద్వారా భర్త వెంకన్నకు తెలిసింది. దీంతో స్వప్నను మందలించడంతో భార్యాభర్తల నడుమ పలుమార్లు గొడవలు కూడా జరిగాయి. స్వప్న..ప్రియుడు ప్రశాంత్ దృష్టికి తీసుకెళ్లగా వెంకన్నను చంపేందుకు పథకం పన్నారు. ఏప్రిల్ 21న వెంకన్న మద్యం తాగి వచ్చి భార్య స్వప్నతో గొడవపడ్డాడు. ఆ తరువాత అన్నం తిని పడుకోగా, సుమారు అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో స్వప్న.. ప్రశాంత్‌కు ఫోన్ చేసి చెప్పగా.. ఎన్ని రోజులు భరిస్తావు..నేను ఉన్నాను. ఎలాగైనా వాడిని అంతం చేయమ'ని చెప్పాడు. దీంతో స్వప్న పడుకున్న భర్త గొంతు నులిమి చంపింది. ఈ మేరకు స్వప్న, ప్రశాంత్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.